


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

నిజమైన వార్తలు • నిష్పక్షపాత విశ్లేషణ • ప్రజల పక్షాన అక్షరం

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 13 | శనివారం 13 జూన్, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## వాళ్లకు ఎలాంటి విజన్ లేదు... పాయిజన్ మైండ్!

# తిరుపతి సభలో చంద్రబాబు



వార్త సాక్ష్యం :
తిరుపతి వేదికగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి (ఎన్డీఏ) ప్రభుత్వం 'రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించింది. ఈ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎన్డీఏ కూటమి నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం చేసి, రెండేళ్ల పాలనలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని, భవిష్యత్ ప్రణాళికలను ప్రజల ముందుంచారు. తన రాజకీయ ప్రస్థానం మొదలైన తిరుపతిలో, ఏడుకొండలస్వామి చెంతన ఈ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉందని, ఇది తనకు పునర్జన్మ లాంటిదని ఆయన వ్యాఖ్యానించారు. - మిగతా2లో

## తెలంగాణలో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్‌కు

# పూర్తి స్వేచ్ఛ ఉంది



వార్త సాక్ష్యం : తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు - మిగతా2లో

# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి



కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర..

30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట లేపేసే ప్లాన్..

బీహార్, బెంగాల్ ఫార్ములాను ఇక్కడా ప్రయోగిస్తున్నారు..

కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడి..

పాలేరు 'బి.ఎల్.ఏ'ల శిక్షణ శిబిరంలో మంత్రి పొంగులేటి నిప్పులు..

2




## 'ఉత్తమ వైద్యం అందిస్తాం'..

చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ

-వివరాలు2లో

# 190 జీవో ను వెంటనే అమలు చేయాలి

**317 జీవో బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు వెంటనే న్యాయం చేయాలి**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



వార్త సాక్ష్యం : జీవో నంబర్ 317 బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు వెంటనే న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన మధ్యంతర జీవో 190 ని వెంటనే అమలు చేయాలన్నారు. వెంటనే 190 జీవో అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు 317 జీవో బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ...అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేస్తోందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. -మిగతా2లో

# అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు

- మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలి.
- అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలి.
- సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి
- శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు
- కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడి



ధర్మఘంట జూన్ 12 : సింగరేణి కార్మికులకు శుభవార్త. సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. - మిగతా2లో


## రాష్ట్ర ప్రజలకు... ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండు ఏళ్ల నమ్మకం



- తిరుపతిలో అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తోని రాష్ట్ర అభివృద్ధి
- నియోజకవర్గ ప్రజలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది
- శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

# సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు

## కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్



- రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై మీనాక్షి నటరాజన్ పిటిషన్ కొట్టివేత
- ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతుందో ఈ ఘటనతో వెల్లడైందని వ్యాఖ్య

వార్త సాక్ష్యం : రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టులో చుక్కెదురైనప్పటికీ, ఇది తనకు ఎదురుదెబ్బ కాదని కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతోందో ఈ ఘటనతో బహిర్గతమైందని ఆమె వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలపై గౌరవం ఉందని, అందుకే కోర్టు తీర్పుపై నేరుగా స్పందించనని తెలిపారు. ఈ పరిణామం తనను షాక్‌కు గురిచేయలేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై తమకు నమ్మకం లేదని, అయితే తమ న్యాయపరమైన వాదనలో - మిగతా2లో

# మన గొప్ప ఎగుమతి మన ప్రజలే: విశాఖ సదస్సులో నారా లోకేశ్



వార్త సాక్ష్యం :
వికసిత్ భారత్ నిర్మాణం అనే బృహత్ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తుందని, నైపుణ్యం కలిగిన మానవ వనరులను సృష్టించడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సుసంపన్న భవిష్యత్తు కోసం మానవ వనరుల పై పెట్టుబడి పెట్టడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన అన్నారు. విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో జరిగిన 'డీజీ 100ఎక్స్ ఏపీ' సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్య, ఆవిష్కరణల - మిగతా2లో

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక

శనివారం 13 జూన్, 2026

# అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు

-మొదటిపేజీ తరువాయి: ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించా లని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవ ర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు. ఇటీవల కాలం వరకు కారుణ్య నియామ కాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో శనివారం (ఈ నెల 13వ తేదీ) జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరి ంచేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు.. ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి.**

అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్సటర్నల్ పోస్టులు ఉండగా 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు. కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామ న్నారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వాటాను చెల్లించామని తెలియజేశారు. గత రెండేళ్లలో రూ.1500 కోట్లను లాభాల వాటా రూపేనా చెల్లించినట్లు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ను చెల్లిస్తున్నామని, 2023-24లో ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున, 2024-25లో రూ.5,500 చొప్పున లాభాల బోనస్ను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణిలో ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా గోదావరిఖని లో క్యాథ్ ల్యాబ్ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత మరియు వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు. రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిల దొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# తెలంగాణలో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది

-మొదటిపేజీ తరువాయి: పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా? అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు.

# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి..

-మొదటిపేజీ తరువాయి: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా బీజేపీపాలితా ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

**- 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం.. దొంగదారి చర్య!**

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

**నిన్న ఓట్లు.. నేడు ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు!**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మీనాక్షి నటరాజన్ గారికి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. నిన్నటి వరకు ఓట్లను దొంగిలించిన వాళ్ళు.. ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజారింది" అని నిప్పులు చెరిగారు.

**సీబీఐ, ఈడీలతో బెదిరింపు రాజకీయాలు.**

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి..**

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. "ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి" అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాళ్లకు ఎలాంటి విజన్ లేదు... పాయిజన్ మైండ్!: తిరుపతి సభలో చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి:

2024 ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు ఎన్డీఏ కూటమికి చారిత్రక విజయాన్ని అందించారని చంద్రబాబు గుర్తుచేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికే ఈ సభను నిర్వహిస్తున్నామని, ప్రజాసేవకు తమ ప్రభుత్వం పునరంకితమవుతోందని ప్రకటించారు. ఈ రెండేళ్లలో ఏం చేశామో, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏం చేయలేకపోయామో కూడా ప్రజలకు చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని, తమ పాలనలో దాపరికం ఉండదని స్పష్టం చేశారు. కష్టకాలంలో విజ్ఞతతో డబుల్ ఇంజన్ సర్కార్‌కు ఓటేసి రాష్ట్రాన్ని గెలిపించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం ఆక్సిజన్ ఇచ్చి బతికించిందని, ఈ రోజు ప్రజలు శాంతియుతంగా, తమ ఆస్తులకు రక్షణతో జీవించగలుగుతున్నారంటే అది ఎన్డీఏ పాలన వల్లే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనను 'చీకటి పాలన'గా అభివర్ణించిన చంద్రబాబు, ఆ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా విధ్వంసం చేశారని ఆరోపించారు. కేంద్ర పథకాలను పక్కనపెట్టి, సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. పెట్టుబడిదారులను వేధించి రాష్ట్రం నుంచి తరిమేశారని, యువత భవిష్యత్తును దెబ్బతీశారని అన్నారు. కేంద్రం ఇంటింటికి కుళాయి కోసం రూ.27,000 కోట్లు ఇస్తే, దానిని కూడా వాడుకోలేని దుస్థితిలో గత ప్రభుత్వం ఉందని విమర్శించారు. తనతో పాటు పవన్ కల్యాణ్‌ను కూడా అడుగడుగునా వేధించారని, ఎలాంటి నోటీసు లేకుండా తనను 53 రోజులు జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రాష్ట్ర ప్రజలకు... ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండు ఏళ్ల నమ్మకం

**ఆత్మకూరు జూన్ 12 వార్త సాక్ష్యం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు రెండేళ్ల పరిపాలనలో సుపరిపాలన కొనసాగిందని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం తిరుపతిలో జరిగిన కూటమి ప్రభుత్వ రెండు సంవత్సరాల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమానికి శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే హాజరయ్యారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు హాజరయ్యారు ఇందులో భాగంగా రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేకూర్చే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది ఈ సందర్భంగా శ్రీశైల నియోజకవర్గం, అభివృద్ధి, సంక్షేమం,కల్పించే విధంగా నియోజకవర్గ ప్రజలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని వివరించారు

## 'ఉత్తమ వైద్యం అందిస్తాం'..

-మొదటిపేజీ తరువాయి: స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్-2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు.అమెరికా క్షిపణి దాడిలో విశాఖ వాసి మృతిపై సీఎం చంద్రబాబు విచా చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

## 190 జీవో ను వెంటనే అమలు చేయాలి

-మొదటిపేజీ తరువాయి: ఏ నిర్ణయం తీసుకోవాలన్నకూడా ఈ ప్రభుత్వానికి గుండె ధైర్యం లేని పరిస్థితి కనిపిస్తుందని చెప్పారు. ఉద్యమకారులు, ఉద్యోగులకు సంబంధించిన అంశాల్లో కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. 317 జీవో బాధితులకు న్యాయం చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆ విషయంలో ముందడుగు వేయటం లేదో చెప్పాలన్నారు. 317 బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు స్థానికత ఆధారంగా బదిలీలు చేస్తామని చెప్పి దామోదర రాజనర్సింహా, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ వేశారని...ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇచ్చిన 190 జీవో ను ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. 317 జీవో బాధితులైన టీచర్లకు స్థానికత ఆధారంగా బదిలీలు చేస్తామని చెప్పారని...అవసరమైతే సూపర్ న్యూమరీ ఉద్యోగాలు కూడా సృష్టిస్తామని హామీ ఇచ్చారని కవిత గుర్తు చేశారు. కానీ 190 జీవో తెచ్చి తొమ్మిది నెలలు గడిచినా దానిని అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఎవరి కోసం, ఏ పైరవీ కోసం ఈ జీవోను అమలు చేయటం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. 190 జీవో గడువే మూడేళ్లు ఉందని ఇప్పటికే 9 నెలలు గడిచిపోయిందని ఇంకెప్పుడూ అమలు చేస్తారని ప్రశ్నించారు.

**ఉద్యోగుల కోసం మేము పోరాడుతాం**

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి కారణంగా టీచర్లు, ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని కవిత అన్నారు. 317 జీవో కారణంగా వారంత స్థానికత కోల్పోయారని చెప్పారు. జీవో 25 రేషనలైజేషన్ తో సంబంధం లేకుండా వెంటనే 190 జీవోను అమలు చేయాలని కవిత కోరారు. అవసరమైతే టీచర్ల కోసం సూపర్ న్యూమరీ ఉద్యోగాలు క్రియేట్ చేయాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చేస్తోన్న తాత్సారంపై ఉద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని కవిత పిలుపునిచ్చారు. టీచర్లు, ఉద్యోగుల హక్కుల కోసం వారి తరఫున తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని కవిత చెప్పారు. వెంటనే 190 జీవో అమలు పై చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని కవిత హెచ్చరించారు.

## సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు

-మొదటిపేజీ తరువాయి: అయితే తమ న్యాయపరమైన వాదనలో ఎలాంటి బలహీనత లేదని ఆమె పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వేసిన తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. దీనిపై ఎన్నికల సంఘంలో పిటిషన్ ద్వారానే పరిష్కారం వెతుక్కోవాలని సూచించింది. 2022లో తెలంగాణలో నమోదైన ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో జూన్ 9న రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే, రెండేళ్లకు పైగా శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల వివరాలు మాత్రమే వెల్లడించాల్సి ఉంటుందని, ఈ కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని ఆమె తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు.

## మన గొప్ప ఎగుమతి మన ప్రజలే: విశాఖ సదస్సులో నారా లోకేశ్

-మొదటిపేజీ తరువాయి:

ప్రపంచం అత్యంత వేగంగా మారుతోందని, కృత్రిమ మేధ (ఏఐ) వంటి సాంకేతికతలు పరిశ్రమలను, ఉద్యోగాలను పునర్నిర్వచిస్తున్నాయని లోకేశ్ అన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా అసలైన బలం భూమి, సహజ వనరులు కావని, ప్రతిభ కలిగిన మానవ వనరులేనని నొక్కిచెప్పారు. దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ దేశానికి అత్యుత్తమ ప్రతిభను అందించిందని, చంద్రబాబు గత పదవీకాలాల్లో చేపట్టిన సంస్కరణల ఫలితంగానే నేడు సిలికాన్ వ్యాలీ నుంచి సింగపూర్ వరకు తెలుగువారు ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. మన గొప్ప ఎగుమతి మన ప్రజలేనని, వారి పై పెట్టుబడి పెట్టడం మనందరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. విద్య అంటే కేవలం డిగ్రీ సర్టిఫికేట్ ఇవ్వడం కాదని, జీవితాంతం నేర్చుకునే ప్రక్రియలో ప్రభుత్వం భాగస్వామి కావాలని అన్నారు. అందుకోసం రెండు వారాల్లో "నైపుణ్యం పోర్టల్" ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిన్నటి ఉద్యోగాల కోసం కాకుండా, ఏఐ, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్ వంటి భవిష్యత్ రంగాల కోసం విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని వివరించారు.

**వ్యక్తిగత ఇష్టంతోనే విద్యాశాఖ బాధ్యతలు**

ముఖ్యమంత్రి శాఖల కేటాయింపు సమయంలో తాను అడిగి మరీ విద్యాశాఖను తీసుకున్నాననిలోకేశ్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. చాలా మంది వద్దని వారించినా, తదుపరి తరం నాయకులను ప్రేరేపించే అవకాశం విద్య ద్వారానే లభిస్తుందనే బలమైన నమ్మకంతో ఈ బాధ్యతను స్వీకరించానని తెలిపారు. పిల్లలను నేను హృదయపూర్వకంగా ప్రేమిస్తాను... వారు చూపే ప్రేమ, ఆప్యాయత, నిజాయతీ నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తాయి... అందుకే విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించానని చెప్పారు.

## నంద్యాల బాల అకాడమీ గణ విజయం

- విద్యార్థుల భవిష్యత్తులో కొత్త అధ్యాయం
- రీకౌంటింగ్ లో పెరిగిన మార్పులు




నంద్యాల జూన్ 12 వార్త సాక్ష్యం

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో బాల అకాడమీకి చెందిన విద్యార్థులు రీకౌంటింగ్ అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. శుక్రవారం బాల అకాడమీ స్కూల్ యాజమాన్యం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాల అకాడమీ యాజమాన్యం పదవ తరగతి విద్యార్థినిలు ఘనంగా సన్మానించారు. గతంలో 587 మార్కులు పొందగా, రీకౌంటింగ్ అనంతరం 591 మార్కులతో బాల అకాడమీలో ప్రథమ స్థానంలో నిలిచింది. అఫ్ష అంజుమ్ అనే విద్యార్థిని గతంలో 582 మార్కులు పొందగా రీకౌంటింగ్ అనంతరం 589 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో మొత్తం మార్కులు పెరిగి మరింత మెరుగైన ఫలితాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బాల అకాడమీ ప్రిన్సిపల్ మాధవి లత మాట్లాడుతూ'విద్యార్థుల కృషి ఎప్పటికి వృధా కాదు. రీకౌంటింగ్ ద్వారా వారికి రావలసిన మార్కులు రావడం ఆనందదాయకం ఇది వారి శ్రమకు దక్కిన న్యాయం' అని పేర్కొన్నారు. విద్యార్థుల విజయం పై ఉపాధ్యాయులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు. బాల అకాడమీ విద్యార్థులు ప్రతిభతో పాటు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతూ మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ కార్మికుల పెండింగ్ పీఎఫ్ వెంటనే చెలించాలి



ఆత్మకూరు జూన్ 12 వార్త సాక్ష్యం

మున్సిపల్ కార్మికులకు 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ కార్మికుల అకౌంట్లో జమ చేయాలని సీఐటీయు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, గొడుగు రాజు, సువర్ణమ్మలు అన్నారు. శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయం దగ్గర మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి, ప్రభుత్వమే జీతాలు చెల్లించాలన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులలో పట్టణ ప్రజలకు కుళాయిల ద్వార నీరు, ఎలక్ట్రికల్ సదుపాయం కల్పిస్తూ, ఎలాంటి అంటువ్యాధులు సంభవించకుండా ఆత్మకూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జి ఓ ఆర్ టి నెంబర్ 1615 ప్రకారం పిఆర్సి జీతాలు చెల్లింపు చేయాలన్నారు. కరువు భత్యం, మధ్యంతర భృతి ఇవ్వాలి, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు ఇవ్వాలన్నారు. పదవి విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు చేయాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ మున్సిపల్ కార్మికులు సుగుణమ్మ, నరసింహుడు, రాజేంద్ర, సన్ని, రవి, సుధాకర్, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం అన్నదాన సత్రానికి విరాళం



శ్రీశైలం జూన్ 12 వార్త సాక్ష్యం

శ్రీశైల పుణ్యక్షేత్రంలో శుక్రవారం కె. పవన్ చైతన్య, హైదరాబాద్‌కు చెందిన కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ పథకారిని విరాళం రూ. 1,01,116/-లను అందజేశారు.. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. శివప్రసాదుకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు శ్రీశైలంలో నిత్యం జరిగే అన్నదాన కార్యక్రమాలలో మా కుటుంబ సభ్యుల తరఫున విరాళం అందించడం ఆ దేవుడు ఇచ్చిన ఆశీస్సులని తెలిపారు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రతిరోజు వేల సంఖ్యలో భక్తాదులు తరలివచ్చి మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి ఆశీస్సులతో దైవదర్శనం ఎంతో ఆనందదాయకంగా ఉంటుందని వివరించారు.

# ప్రకృతి వ్యవసాయమే శాశ్వత పరిష్కారం....డి పి ఏం శ్రీనివాసులు

ఆత్మకూరు, జూన్ 12 వార్త సాక్ష్యం

ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, ముఖ్యంగా ఎల్-నినో ప్రభావం కారణంగా వర్షపాతం లోపం, అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అమలు చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం ) పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని నల్లకల్వ, కరివెన, కురుకుంద, కొట్టాల చెరువు, గ్రామాలలో నిర్వహించిన పి ఏం డి ఎస్ పద్ధతిలో విత్తన గుళికలు చేసి పాడి పంటల సాగులో ఎల్-నినో ప్రభావం వల్ల సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, దీనివల్ల పంటల దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం రైతులకు రక్షణ కవచంలా పనిచేస్తుందని వివరించారు.ప్రకృతి వ్యవసాయంలోఅనుసరించే ఆచ్ఛాదన (మల్చింగ్), జీవామృతం, ఘనజీవామృతం, బీజామృతం, వాపసా, అంతర పంటలు, మిశ్రమ పంటల సాగు వంటి విధానాలు నేలలో తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచి పంటలను ఎండల నుంచి రక్షిస్తాయని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా భూసారం పెరిగి పంటల ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు, కూరగాయలతో కూడిన బహుళ పంటల విధానాన్ని అవలంబించాలని సూచించారు. దీనివల్ల వాతావరణ ప్రతికూలతల సమయంలో కూడా ఆదాయ భద్రత కలుగుతుందని అన్నారు. వర్షపు నీటి సంరక్షణకు ప్రతి రైతు తన పొలంలో కందకాలు, ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు తమ



గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ నమూనా క్షేత్రాలను అభివృద్ధి చేసి ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు వ్యయాలు గణనీయంగా తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడి, వాతావరణ మార్పులకు తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు ప్రకృతి వ్యవసాయ శాఖ అందిస్తున్న సాంకేతిక సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు ఎల్-నినో పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి నిర్వహణ పద్ధతులు, పంటల ఎంపిక, జీవ ఎరువుల తయారీ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డి పి ఏం శ్రీనివాసులు, ఏ డి పి ఏం అబ్దుల్ సలాం, ఏం ఏం టి ఎల్ భీమేష్, ఎస్ ఆర్ పి నరేంద్ర గౌడ్, ఎన్ ఎఫ్ ఏ నాగరాజు, ఆర్ ఎస్ కే వి ఏ ఏ లు, వి హెచ్ ఏ లు, ఏం టి సయ్యద్ భాషా, ఎఫ్ ఎం టి లు, శశికళ, చిన్న స్వామి నాయక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు జిల్లా ప్రాథమిక బాలికల ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధకృష్ణ కిట్టు పంపిణీ





- విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి లక్ష్యం
- విద్యా కమిటీ చైర్మన్ ఖాజావలి

ఆత్మకూరు జూన్ 12 వార్త సాక్ష్యం

పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక జిల్లా ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యా కమిటీ చైర్మన్ ఖాజావలి ఆధ్వర్యంలో విద్యార్థినిలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్టును పంపిణీ చేయడం చేయడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చొరవతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థినిలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలియజేశారు ముఖ్యంగా మధ్యాహ్నం భోజనం పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ విద్యార్థుల చదువులకు బాటలు వేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని తెలియజేశారు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు సర్వేపల్లి రాధాకృష్ణ కిట్టులో విద్యార్థినిలకు పాఠ్యపుస్తకాలు స్కూల్ బ్యాగులు తోపాటు విద్యార్థులకు ఉపయోగపడే అన్ని ఆ కిట్టులో ఉన్నాయని చెప్పారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, విద్యా కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీదేవి, పిటి శంకర్, విద్యార్థుల తల్లిదండ్రులు, అస్రప్ అలీ, యాహత్ అలీ, మహబూబ్ బాషా, టి. జహాదలీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దాపురం చెరువు కట్ట సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తా



- ప్రాణాపాయ పరిస్థితిలో ట్రాక్టర్ డ్రైవర్
- రాత్రివేళ సమయంలో అధికమవుతున్న రోడ్డు ప్రమాదాలు

ఆత్మకూరు జూన్ 12 వార్త సాక్ష్యం

శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు -గుంటూరు జాతీయ రహదారిపై ఆత్మకూరు మండల పరిధిలోని సంజీవ నగర్ తాండ సమీపంలో సిద్దాపురం చెరువు కట్ట దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన చోటుచేసుకుంది సంజీవ నగర్ తాండకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సోమ్లా నాయక్, తలకు, కాలుకు, తోపాటు శరీరంలో పలుచోట్ల అధిక రక్త స్రావలతో తీవ్ర గాయాలు కావడంతో వెంటనే విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని డాక్టర్




నడుపుతున్న డ్రైవర్ ను. సోమ్లా నాయక్ ను వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు గుర్తుతెలియని వాహనంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య

జూన్ 12 వార్త సాక్ష్యం

పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం లో విశాలమైన తరగతి గదులు, ప్రాంగణంతో కూడిన ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అర్హత అనుభవం అంకితభావం కలిగిన ఉపాధ్యాయులతో ఉచిత నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తోపుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి తెలిపారు. మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయ బృందం ఇంగ్లీష్ మీడియం లో విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు రెండు జతల ఏకరూప దుస్తులతో పాటు సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన ఫర్నిచర్ విడివిడిగా పరిశుభ్రమైన వ్యక్తిగత మరుగుదొడ్లు డిజిటల్ బోర్డులతో డిజిటల్ విద్యా బోధన కంప్యూటర్ విద్య సైన్స్ ల్యాబ్ క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులకు ప్రతినెల క్విజ్ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఉదయం సాయంత్రం ప్రత్యేకతలను నిర్వహించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు స్కాలర్షిప్ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల మోజులో పడి లక్షలాది ఫీజులు కట్టి అప్పుల పాలు కాకుండా తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ మౌలాలి. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి, రాంబాబు, చంద్రశేఖర్, శ్రీనివాస్, సాయికుమార్, స్వాతి, లతో పాటు గ్రామస్తులు షేక్ గూడుబీ, షేక్ లతీఫ్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి ఎన్నికల హామీలను అమలు చేసి సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

**-కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా**

జూన్ 12 వార్త సాక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.గ్రామపంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బందిని 2వ పీఆర్సీలో గుర్తించాలని, జీఓ నెం.51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలని కోరారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ, జిల్లా కార్యదర్శి అన్నల్దాస్ గణేష్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంపై తక్షణమే దృష్టి సారించాలని అన్నారు. 2025 సంవత్సరంలో ప్రభుత్వం కార్మికుల వ్యక్తిగత వివరాల సేకరణ చేపట్టిందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 60 సంవత్సరాలు పైబడిన, అనారోగ్యానికి గురైన, సహజ లేదా ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇచ్చి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.వారసులు లేని కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని, ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులపై వేధింపులు, అక్రమ తొలగింపులు నిలిపివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, కార్మికులందరికీ రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.అలాగే మరణించిన కార్మికుల అంత్యక్రియలకు రూ.30 వేల ఆర్థిక సహాయం, పంచాయతీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఏఓ, డీపీఓ అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో అక్కల అంజయ్య, లోకిని శ్రీనివాస్, కంసాని రవీందర్, సందేలా మహేష్, వరుకోలు మల్లయ్య, బత్తుల రమేష్, బెజగం శేఖర్, బాబు మర్రిగడ్డ, నాగరాజు కొత్తపల్లి, అశోక్ కట్కూరు, రామదాస్ పోతుగల్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.




# అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణం

జూన్ 12 వార్త సాక్ష్యం

నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని చంద్రాయన్ పల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరగడం విశేషం. అదే వేద విధముగా శుక్రవారం రోజున సీతారామచంద్రస్వామి కళ్యాణం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సందడి సీతారామరెడ్డి, మరియు ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి , శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణం భక్తుల మధ్యలో మరియు చంద్రాయన్ పల్లి గ్రామ ప్రజల మధ్యలో ఘనంగా జరిపించారు. రాములోరి కళ్యాణాన్ని వీక్షించడానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం సందడి సీతారాం రెడ్డి కుమారుడు, కోడలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారాముల కళ్యాణాన్ని వీక్షించారు.





సాయంత్రం స్వామివారి పల్లకి ఊరేగింపు.గట్టి ఇప్పలపల్లి కళాబృందంచే భక్తి కీర్తనలు,కోలాటాలతో స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో వీరాంజనేయ కమిటీ చైర్మన్ సందడి సీతారాం రెడ్డి,పసుల శేఖర్ రెడ్డి,పసుల రాంరెడ్డి,సర్పంచ్ చిలికేశ్వరం శంకర్ ముదిరాజ్,ఉప సర్పంచ్ దేరంగుల వెంకటయ్య,మాజీ ఉప సర్పంచ్ సొప్పరి పర్వతాలు,గ్రామ పెద్దలు బాధగొని సాంబయ్య గౌడ్, సందడి అల్వాల్ రెడ్డి,సందడి కిష్టారెడ్డి,సందడి రఘుమా రెడ్డి,దేరంగుల అంజయ్య,యువకులు రేపని రమేష్ గడ్డమీది శ్రీను,కోట్ర వెంకటయ్య,సొప్పరి వెంకటయ్య,బాలచంద్రి, పీట్ల జంగయ్య, రేపని సహదేవ్, గ్రామ ప్రజలు, యువతి యువకులు, మహిళలు, ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

**-జిల్లాలో జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తాం.**
**-త్వరలో యూనియన్ సభ్యులకు ఐడి కార్డులు అందజేస్తాం.**
**-యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.**
**-టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు.**

జూన్ 12 వార్త సాక్ష్యం

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేసి రాబోయే తరానికి ఆదర్శంగా నిలిచే విధంగా యూనియన్ కార్యక్రమాలు చేపడుతున్నామని టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో గల టియుడబ్ల్యూజే ఐజేయు అనుబంధ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ సభ్యుల సహాయ సహకారాలు ఉంటేనే జర్నలిస్టుల సంక్షేమం కోసం వినూత్న కార్యక్రమాలు చేపట్టి సక్సెస్ అవుతాం అన్నారు. జిల్లాలోని యూనియన్ సభ్యులందరికీ ఐడి కార్డులు అందజేసే దిశగా పని చేస్తున్నామని, అందులో 70 శాతం కార్డులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా సభ్యుల వివరాలు త్వరగా పంపిస్తే ఈ నెలాఖరు వరకు ఐడి కార్డులు పంపిణి చేయనున్నట్టు వివరించారు. అక్రిడేషన్ కార్డుల పట్ల అపోహలు వద్దని, అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందేలా యూనియన్ పక్షాన కృషి చేస్తామన్నారు. జిల్లాలో అక్రిడేషన్ కార్డుల జారీ పక్రియ ఇంచార్జి డిపిఆర్వో వల్ల జాప్యం జరిగిందన్నారు. జిల్లాలో అన్ని పత్రికలకు జివో ఆదారంగా 450 కి పైగా కార్డులు ఇవ్వడానికి కమిటి ఆమోదం తెలిపిందన్నారు. అర్హులకు కార్డు రాకపోతే కొట్లాడదాం కాని అనర్హులు మాత్రం కార్డు పొందరాదన్నారు. జర్నలిస్టులుగా సమాజం కోసం పని చేసే అర్హులైన వారందరికీ కార్డులను అందజేసేలా చూస్తామన్నారు.వృత్తిలో కొనసాగుతున్న జర్నలిస్టులందరికీ మొదటి విడత కార్డులు జారీ చేస్తారని వివరించారు. జిల్లాలో జర్నలిస్టుల కోసం శిక్షణా తరగతులు పెట్టుకోవాలని రాష్ట్ర కార్యవర్గానికి తెలిపామని, మీడియా అకాడమి తరుపున శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు.శిక్షణా తరగతులకు 50 నుండి 60 మంది జర్నలిస్టులే అర్హులు కావున జిల్లాలో 3 చోట్ల శిక్షణా తరగతులు కావాలని అకాడమీ చైర్మెన్ ను కోరామని చెప్పారు. త్వరలోనే నియోజకవర్గాల వారీగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తాం అన్నారు. త్వరలో జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా అధికారులతో చర్చించామన్నారు. యూనియన్ కార్యవర్గ సభ్యులు కార్యక్రమాల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. యూనియన్ పక్షాన జర్నలిస్టులకు క్రీడా పోటీలు నిర్వహిస్తాం అని అన్నారు. యూనియన్ ప్రాతినిధ్యం లేని మండలాలకు ప్రాతినిధ్యం ఇచ్చి ఈసి మెంబర్లను నియమించాలని సూచించారు. త్వరలో జిల్లా కార్యవర్గానికి ఉప కమిటీలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సీనియారిటీ ఉన్న వారికి ఉప కమిటిల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి నెల జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరు కాని వారిని కార్యవర్గం నుండి తొలగిస్తాం అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని కలెక్టర్ ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే అన్ని మండలాల ఎం ఈ ఓలకు సర్క్యూలర్లు అందుతాయన్నారు. అదేవిధంగా యూనియన్ ను విచ్చిన్నం చేసే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం అని హెచ్చరించారు. ఫీల్డ్ లో లేని వారిని యూనియన్ నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. కార్యవర్గ సభ్యులందరూ యూనియన్ పటిష్టతకు విభిన్న కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగుల గోపాల్ చారి, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, అల్లే రాము, లోక రమణా రెడ్డి, కోశాధికారి సిరిసిల్ల వేణు గోపాల్, సహాయ కార్యదర్శులు గుర్రం చంద్ర శేఖర్, కోరేపు రాజ్ కుమార్, చింత నరేష్, కార్యవర్గ సభ్యులు మనోజ్, శంకర్ గౌడ్, రఘుపతి రెడ్డి, హరీష్, నరేష్, సాజీద్, జమీర్ అలీ, గౌస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు అండగా ప్రభుత్వం

**-40 సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన శ్రీహరిరావు**



జూన్ 12 వార్త సాక్ష్యం

నిర్మల్,శుక్రవారం: నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది లబ్ధిదారులకు 10 లక్షల 40 వేలవిలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక ఇబ్బందులు, వైద్య చికిత్సలు మరియు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపశమనం కలిగిస్తోందని తెలిపారు. ప్రజలు ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు చెక్కులు అందుకున్న అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి, అలాగే తమ సమస్యలను గుర్తించి సహాయం అందించిన కూచాడి శ్రీహరిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందించాలి

**-మహబూబాబాద్ జిల్లా రజక వృతిదారుల సంఘం కార్యదర్శి పున్నం సారయ్య**

జూన్ 12 వార్త సాక్ష్యం



ప్రతినిధి పున్నం సారయ్య : హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలిక కుటుంబాన్ని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నాయకులు పరామర్శించి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా రజక వృతిదారుల సంఘం కార్యదర్శి పున్నం సారయ్య మాట్లాడుతూ...బాలికకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యుడైన నిందితుడిని వెంటనే రిమాండ్‌కు పంపించి, పోక్సో చట్టంతో పాటు హత్యాయత్నం/హత్య కేసులు నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక భవిష్యత్ వైద్యం, పునరావాసం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాసంఘాలు, సామాజిక సంస్థలు తమ మద్దతును కొనసాగిస్తాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన సహాయ సహకారాలు అందించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

# పారిశుద్ధ కార్మికులకు సబ్బులు పంపిణీ

**-మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు**



జూన్ 12 వార్త సాక్ష్యం

చండూరు మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, బెల్లం మరియు కొబ్బరి నూనె పంపిణీ చేశారు మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, పారిశుధ్య సిబ్బంది సేవలు సమాజానికి ఎంతో విలువైనవని, వారి శ్రమ వల్లనే ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. , పారిశుధ్య కార్మికులు మున్సిపాలిటీ అభివృద్ధిలో అంతర్భాగమని, వారి సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో కూడా పారిశుధ్య సిబ్బందికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్, మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ఎండ, వాన, చలి వంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్నారని అన్నారు. వారి ఆరోగ్యం, భద్రత,సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పారిశుధ్య సిబ్బంది మున్సిపాలిటీ చేపట్టిన ఈ సంక్షేమ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేస్తూ, తమ సంక్షేమం పట్ల శ్రద్ధ చూపుతున్న చైర్మన్, కమిషనర్, ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు, కౌన్సిలర్స్, కో-ఆప్షన్ సభ్యులు వార్డ్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి అడ్డాగా మాడుగులపల్లి రోడ్డు నిర్మాణం పనులు

-రోడ్డు పనులల్లో ఎంత అవినీతి జరుగుతున్న చూచి చూడనట్లుగా వ్యవహరిస్తున్న ఆర్ అండ్ బి అధికారులు
-సిసి రోడ్లకు నీళ్లు (క్యూరింగ్) పోయని కాంట్రాక్టర్లు తొందర్లో దెబ్బతినే అవకాశం ఉందన్న స్థానికులు
-రోడ్డు మధ్యలో గుంత ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్న రోడ్డు నిర్మాణ పనులు
-మామూలు మత్తు లో ఊగిసలాడుతున్న అధికారులు ఇసుక బదులు కంకర పౌడర్ (డస్ట్) వినియోగం

జూన్ 12 వార్త సాక్ష్యం





మాడుగులపల్లి మండలం చిరుమర్తి నుండి మాడుగులపల్లి గ్రామాలలో స్థానికంగా వేసే రోడ్డులో ఎక్కడ చూసినా నాసిరకంగా కనిపిస్తున్నాయి అక్కడి ప్రజలు వాపోతున్నారు. ప్రజాదనం తోవ తప్పుతుంది నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. అధికారుల పర్యవేక్షణ ఆటకెక్కింది మాడుగులపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణం పనులల్లో అవినీతికి నిలువుటద్దంగా మారింది. మాడుగులపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారి పనులలో సాగుతున్న అక్రమాలు ఇప్పుడు మండలంలో చర్చనీయంగా మారాయి. రోడ్డు వేస్తున్న క్రమంలో సగానికి వదిలిపెట్టి రోడ్డు వేయటం వలన అక్కడ ప్రమాదాలు జరిగేటటువంటి అవకాశం చాలా వరకు ఉన్నది ఏదేమైనా రోడ్డు పటిష్టంగా ఉండాలంటే దాన్ని పునాది బలంగా ఉండాలి నిబంధనల ప్రకారం రోడ్డు నిర్మాణంలో నిర్మిత మోతాదులో ఇసుకను వినియోగించి పనులు చేయాలి. కానీ ఇక్కడ కాంట్రాక్టర్లు ఆ నిబంధనలు వర్తించవు కాబోలు ఇసుక వాడితే ఖర్చు పెరుగుతుందని ఉద్దేశంతో దాని స్థానంలో నాణ్యతలేని కంకర పొడి (డస్ట్) ను విచ్చలవిడిగా వాడుతున్నారు. ఈ డస్ట్ తో రోడ్డు నిర్మిస్తే అది లోపల గట్టిదనాన్ని కోల్పోయి వాహనాలు రాకపోకలకు మరియు వర్షాలకు మొదలైన కొద్ది రోజులకి కృంగిపోతుంది కేవలం పైపైన రంగు పూసి లోపలడస్ట్ తో నింపేస్తున్న ఈ నాణ్యత లేని రోడ్లు మొదటి వర్షానికి కొట్టుకుపోవడం ఖాయమని స్థానికులు మండిప డుతున్నారు. ఇంజనీర్ అధికారులు పర్యవేక్షణ చూద్దాం అన్న ఎక్కడ చూసినా కనిపించదు. సిబ్బంది ఏం చేస్తున్నట్టు ఏ ఒక్కరు తనిఖీ చేసిన దాఖలాలు ఇంత వరకు లేవు అధికారులు కాంట్రాక్టర్లతో చేతులు కలిపి కమిషన్ల మత్తులో మునిగితేలుతున్నారు. అందుకే ఈ అక్రమన బాహాటంగా జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజలు వెంటనే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మాడుగులపల్లి రోడ్డు పనులను తనిఖీ చేయాలని నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

-రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



జూన్ 12 వార్త సాక్ష్యం

రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తే, ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. ఈ దిశగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా చైతన్యపర్చేందుకు కృషి చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. పోలీస్, నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, రవాణా శాఖ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్యారోగ్యం, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో పాటు రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాల గురించి, ప్రమాదాలకు గల కారణాలపై సమావేశంలో చర్చించి పలు సూచనలు చేశారు. ప్రమాదాలను నిలువరించేందుకు ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యల గురించి అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు మార్గనిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం లైన్ డిపార్ట్ మెంట్స్ కు చెందిన అధికారులు పరస్పర సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలన్నారు. వరి కోతల సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులకు, వాహన డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన పెంపొందేలా విరివిగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించబడిన ప్రదేశాలలో తక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా, అందుకు గల కారణాలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరపాలని, తద్వారా అలాంటి చోట్ల మరోమారు ప్రమాదాలు జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రమాదాలకు కారణం అవుతున్న ఆక్రమణలను సంబంధిత శాఖలు సమన్వయంతో తొలగించాలని సూచించారు. పీ.ఎం రహ్ వీర్, పీ.ఎం రాహత్ కార్యక్రమాల గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్ రావు, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, ఆర్ అండ్ బీ ఈ.ఈ అజ్మీర, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఎన్.ఐ.సీ అధికారి మధు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్, ఈ-దార్ మేనేజర్ హర్ష, రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్స ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడి కేవలం పాఠశాల కాదు... పేదవాడి భవిష్యత్తుకు పునాది

జూన్ 12 వార్త సాక్ష్యం



ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం అంటే ఒక భవనాన్ని కాపాడటం కాదు... సమాజంలో సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని, భవిష్యత్ తరాల ఆశలను కాపాడుకోవడం. ఒక పాఠశాల మూసివేయబడినప్పుడు మూసుకుపోయేది కేవలం ఒక గది తలుపు కాదు. అక్కడ చదవాలని కలలు కనే ఒక పేద విద్యార్థి ఆశలకు కూడా తాళం పడుతుంది. పేద కుటుంబంలో పుట్టిన పిల్లవాడికి ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రభుత్వ పాఠశాలలు ఎన్నో దశాబ్దాలుగా మార్గం చూపిస్తున్నాయి. ప్రభుత్వ బడి అంటే కేవలం గోడలు, బెంచీలు, బ్లాక్‌బోర్డులు కాదు. అది సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించే వేదిక. ధనికుడి బిడ్డ అయినా, కూలీ కుటుంబానికి చెందిన బిడ్డ అయినా ఒకే తరగతి గదిలో కూర్చుని ఒకే అక్షరాన్ని నేర్చుకునే ప్రజాస్వామ్య ప్రదేశం. విద్య అనేది వ్యాపార వస్తువు కాదు... ప్రతి పౌరుడి హక్కు. కానీ నేటి పరిస్థితుల్లో విద్య రంగంలో పెరుగుతున్న వాణిజ్య ధోరణులు పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారాన్ని పెంచుతున్నాయి. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడితే దాని ప్రభావం ఎక్కువగా సామాన్య కుటుంబాలపైనే పడుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అనేక మంది విద్యార్థులు తర్వాతి కాలంలో శాస్త్రవేత్తలు, అధికారులు, నాయకులు, మేధావు లుగా ఎదిగారు. వారి విజయాల వెనుక ఉన్న ముఖ్యమైన ఆధారం అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలే. ప్రభుత్వ బడిని విమర్శించడం సులభం. కానీ దాన్ని మెరుగుపరచడం మన అందరి బాధ్యత. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, ఉపాధ్యాయుల గౌరవం, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరిగితే ప్రభుత్వ విద్య మరింత బలపడుతుంది. ఒక దీపాన్ని ఆర్పేసి చీకటిని నిందించినట్లుగా, ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేసి వాటి నాణ్యతపై ప్రశ్నించడం సరైన పరిష్కారం కాదు. సమస్యలను గుర్తించి పరిష్కరించడం ద్వారా ప్రభుత్వ విద్యను మరింత శక్తివంతం చేయాలి. మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు వంటి పథకాలు పేద విద్యార్థులకు చదువును కొనసాగించే అవకాశం కల్పిస్తున్నాయి. ఇవి కేవలం సంక్షేమ కార్యక్రమాలు కాదు... విద్య ద్వారా సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే పెట్టుబడులు. ఒక గ్రామంలో పాఠశాల లేకపోతే దాని ప్రభావం ఆ గ్రామ భవిష్యత్తుపై పడుతుంది. పిల్లలు చిన్న వయసులోనే చదువుకు దూరమై కూలీ పనుల వైపు వెళ్లే ప్రమాదం ఉంటుంది. అందుకే ప్రతి గ్రామంలో మంచి ప్రభుత్వ పాఠశాల ఉండటం అత్యవసరం. ప్రభుత్వ బడిని కాపాడటం అంటే కేవలం ఉపాధ్యాయుడి ఉద్యోగాన్ని లేదా ఒక భవనాన్ని కాపాడటం కాదు. అది ఒక పేద కుటుంబం తన పిల్లల భవిష్యత్తుపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడటం. మన ఊరి బడి... మన పిల్లల భవిష్యత్తు. మన ప్రభుత్వ పాఠశాలలు బలంగా ఉంటేనే సమానత్వం ఉన్న సమాజం నిర్మాణం అవుతుంది. అందుకే ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. ఎందుకంటే ఒక పాఠశాల వెలిగితే ఒక కుటుంబం వెలుగుతుంది... ఒక తరం మారుతుంది. బహుజన ఉద్యమ నాయకులు కురిమెళ్ళ శంకర్ పేర్కొన్నారు

## డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

- జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

జూన్ 12 వార్త సాక్ష్యం

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, సమాజానికి సేవ చేసే వనరుగా ఎదగాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చివ్వెంల మండల పరిధిలోని దురాజుపల్లి గ్రామ సమీపంలోని ప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉందని, ఇందుకోసం పోలీస్ శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, అలాంటి యువశక్తి మాదకద్రవ్యాలకు బానిసైతే కుటుంబాలతో పాటు దేశ ప్రగతికి కూడా తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల్లో డ్రగ్స్ ఒకటిగా మారిందని పేర్కొన్న ఆయన, మాదకద్రవ్యాల వ్యసనంతో యువత తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని తెలిపారు. వ్యసనాలకు బానిసైన వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు కూడా సమాజానికి సవాళ్లుగా మారాయని ఎస్పీ పేర్కొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అజాగ్రత్త వల్ల ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అపరిచితులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం ఇవ్వవద్దని సూచించారు. తక్కువ వడ్డీ రుణాలు, బహుమతులు, ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే సందేశాలను నమ్మి డబ్బులు పంపవద్దని ప్రజలకు సూచించారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులు డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని, వ్యసనాలకు గురైన వారిలో పరివర్తన తీసుకురావడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ మహేష్, కనకరత్నం, బరోసా ఎస్ఐ మౌనిక, షీ టీమ్ ఎస్ఐ నీలిమ, పోలీసు సిబ్బంది, కళాశాల యాజమాన్యం డాక్టర్ రామకృష్ణ,అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు జీతాల్లేవు.. మహిళలను కోటీశ్వరులను చేస్తారా?

-పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి: బీఆర్ఎస్ బీసీ సెల్ జిల్లా నాయకులు భూపతి శ్రీనివాసరావు

జూన్ 12 వార్త సాక్ష్యం




రెండు నెలలుగా 62 వేల మంది అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు చెల్లించలేని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ బీసీ సెల్ జిల్లా నాయకులు భూపతి శ్రీనివాసరావు విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలను వెంటనే విడుదల చేసి మహిళల పట్ల తమకు గౌరవం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సేవలను గుర్తించిన గత ప్రభుత్వం వారి హోదాను అంగన్‌వాడీ టీచర్లుగా ఉన్నతీకరించిందని భూపతి తెలిపారు. 2014లో అంగన్‌వాడీ టీచర్లకు రూ.4,200, సహాయకులకు రూ.2,200 వేతనం ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీచర్ల వేతనాన్ని రూ.13,650కు, మినీ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాలను రూ.7,800కు పెంచామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభయహస్తం మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18 వేల వరకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. 30 నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి, అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని భూపతి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బాల కార్మిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

-జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్

జూన్ 12 వార్త సాక్ష్యం



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి సహకరించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మణుగూరు మండలం సీతారాంపురం గ్రామంలోని ఇటుక బట్టీల యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. రాజేందర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ సమాజ అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారుతుందని అన్నారు. ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, రక్షణతో పాటు గౌరవప్రదమైన బాల్యం పొందే హక్కు ఉందని తెలిపారు.
చిన్నారులను పనిలో నియమించడం చట్టవిరుద్ధమని, బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం ప్రకారం బాలలను పనిలో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అధికారులు సీతారాంపురం గ్రామంలోని ఇటుక బట్టీలను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికుల పరిస్థితులు, వారి పిల్లల విద్యా స్థితిగతులు, బాల కార్మికులు ఉన్నారా అనే అంశాలపై వివరాలు సేకరించారు. ఇటుక బట్టీల యజమానులు, నిర్వాహకులు తమ వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ బాల కార్మికులను నియమించరాదని, కార్మికుల పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో యజమానులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం లేబర్ ఆఫీసర్ నాగరాజు, ఇటుక బట్టీల యూనియన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి కొండలరావు, ఇటుక బట్టీల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## పాడుబడిన ప్రభుత్వ భవనాలు.. ప్రజలకు ప్రమాద ఘంటికలు నాచారం విజయలక్ష్మి








-మేడ్చల్‌లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు
-అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్న వైనంలి

జూన్ 12 వార్త సాక్ష్యం

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం, సంబంధిత శాఖల ఉదాసీనత కారణంగా మేడ్చల్ పట్టణంలోని పలు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకుని ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థుల చదువులకు కేంద్రంగా నిలిచిన ప్రభుత్వ పాఠశాల భవనాలు నేడు పాడుబడి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని పాడుబడిన ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలను పరిశీలించారు. జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. మేడ్చల్ పట్టణంలోని అర్జున్‌వాడ ప్రాంతంలో రథంశాల సమీపంలో, అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా ఉన్న పాడుబడిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రతినిధులు సందర్శించారు. ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని స్థానికులకు ఇబ్బందిగా మారిందని వారు పేర్కొన్నారు. మాజీ వార్డు సభ్యుడు గల్వ మహేష్ మాట్లాడుతూ, ఇళ్ల మధ్యలో ఉన్న ఈ భవనం రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులకు నిలయంగా మారిందని ఆరోపించారు. చిన్నారులు, మహిళలు సంచరించే ప్రాంతంలో ఇలాంటి శిథిల భవనం ఉండటం ప్రజల భద్రతకు ముప్పుగా మారిందన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ప్రాంతంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపులు కూడా ప్రజలకు మరో సమస్యగా మారాయని గల్వ మహేష్ తెలిపారు. బెల్ట్ షాపుల వల్ల యువత చెడు అలవాట్లకు బానిసలవుతు ండటంతో పాటు శాంతిభద్రతలకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ గుప్తా మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. పాడుబడిన ప్రభుత్వ భవనాలను వెంటనే తొలగించడం లేదా ప్రజా అవసరాలకు అనుగుణంగా పునర్వినియోగం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులు నిర్లక్ష్యానికి గురికావడం బాధాకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదకరంగా మారిన భవనాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ గుప్తా, జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి, ఎం. లావణ్య, మేడ్చల్ విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, నర్సింహులు పటేల్, మాజీ వార్డు సభ్యుడు గల్వ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## "ప్రతి చిన్నారికి విద్య -- ప్రతి చిన్నారికి బాల్యం" అనే లక్ష్యంతో బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలి

-బాలకార్మిక నిర్మూలన పోస్టర్ ను ఆవిష్కరించిన
-జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

జూన్ 12 వార్త సాక్ష్యం




ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల కార్మిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్యం అనేది ప్రతి చిన్నారి హక్కు అని, పిల్లలు విద్యను అభ్యసిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణంలో ఎదగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ పిల్లల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, హోటళ్లు, దుకాణాలు, పరిశ్రమలు, ఇతర వ్యాపార సంస్థల్లో బాల కార్మికులను నియమించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలలకు పంపాలని, బాల కార్మికులు ఎక్కడైనా కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రతినిధులు, పౌర సమాజం భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. "ప్రతి చిన్నారికి విద్య -- ప్రతి చిన్నారికి బాల్యం" అనే లక్ష్యంతో బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

## గంగ వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వెంటనే ప్రారంభించాలి: బీజేపీ డిమాండ్

-తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ

జూన్ 12 వార్త సాక్ష్యం






మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గంగ వెంచర్‌లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకురాలు జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ, గంగ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన అనేక మంది కుటుంబాలు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఆందోళన చెందుతునా ్నరని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమ దాసు, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శి బండి విష్ణు, సీనియర్ నాయకులు ధాత్రిక లక్ష్మణ్ వంజరి, మహిళా నాయకులు తోట అనిత, అనిత, నాయకులు బొజ్జ వంశీ రెడ్డి, జకట బాబు రాజు, చెరువుకొమ్మ శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌలికర్, పురుషోత్తం, మల్లికార్జున్, ఎన్.ఎస్. గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని, గంగ వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

## రైతులందరికీ పారదర్శకంగా ఎరువుల సరఫరా

-జిల్లా కలెక్టర్ రాజర్షి షా

జూన్ 12 వార్త సాక్ష్యం

జిల్లాలోని రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల సరఫరాను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించేందుకు 'యూరియా బుకింగ్ యాప్'ను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ మొబైల్ నంబర్ ద్వారా ఈ యాప్‌లో నమోదు చేసుకుని,యూరియాను ముందస్తుగా బుక్ చేసుకొని కొనుగోలు చేయవచ్చని ఆయన సూచించారు. ఈ యాప్ ద్వారా కౌలు రైతులు, పట్టా పాసు పుస్తకం లేని రైతులు సైతం తమ మొబైల్ నంబర్ సహాయంతో సులువుగా నమోదు చేసుకుని యూరియా పొందే అవకాశం కల్పించినట్లు సూచించారు.గత సంవత్సరం పంట నమోదులో రిజిస్టర్ కాని ఎన్ డి ఎస్ ఢ పీ పీ భూముల రైతులు,తమ పరిధిలోని మండల వ్యవసాయ అధికారిని సంప్రదించి యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలని,తద్వారా తమ సాగు విస్తీర్ణానికి తగినట్లుగా యూరియా బుక్ చేసుకోవచ్చని తెలిపారు.గతంలో నమోదు చేసిన మొబైల్ నంబర్‌లో మార్పులు ఉన్నా,లేదా యాప్ వినియోగంలో సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి నంబర్‌ను నవీకరించుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లా వానకాలం-2026 సీజన్ నిమిత్తం 45,000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరాల కోసం హైదరాబాద్‌లోని వ్యవసాయ సంచాలకులకు సరఫరా ప్రణాళికలు పంపినట్లు వివరించారు. జిల్లాకు ఇప్పటివరకు 27,227 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా,ప్రస్తుతం జిల్లాలో 23,233 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.కాగా, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 23,723 మంది రైతులు 95,645 బ్యాగులను బుక్ చేసుకోగాఅందులో 79,365 బ్యాగుల కొనుగోలు పూర్తయిందని వెల్లడించారు.రైతుల సౌకర్యార్థం యూరియా మొబైల్ యాప్ ప్రతిరోజూ ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 10:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని,యాప్ వినియోగంపై ఏవైనా సందేహాలు ఉంటే ఉదయం 10:00 నుండి సాయంత్రం 05:00 గంటల లోపు టోల్ ఫ్రీ నెంబర్ 1800-123-7157 ను సంప్రదించవచ్చని సూచించారు.ఇతరత్రా ఎలాంటి సమస్యలు తలెత్తినా జిల్లా హెల్ప్ లైన్ నెంబర్ 8977742855 కు ఫోన్ చేసి రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రెండవ విడత ఇందిరమ్మ గృహాల మంజూరులో అర్హులైన వారి నీగుర్తించా

-ఎంపీడీవో ప్రవీణ్ కుమార్



జూన్ 12 వార్త సాక్ష్యం

కామారెడ్డి జిల్లాదోమకొండ మండలంలోని అందరూ పంచాయతీ కార్యదర్శులు , ఉపాధి హామీ సిబ్బంది లతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల గుడిసెలు ఉన్నవారి ఎంపిక నిమిత్తమై అర్హులైన వారికి ఇట్టి ఇందిరమ్మ ఇల్లు మంజూరు నిమిత్తం సంబంధిత ఇందిరమ్మ కమిటీ మరియు సర్పంచులు యొక్క ఆమోదంతో ఇల్లు మంజూరు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని దృఢ సంకల్పంతో ఉందో ప్రతి పేదవానికి ప్రతి గుడిసె ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు నిమిత్తం సర్వే చేసి జిల్లా కలెక్టర్ మంజూరు నిమిత్తం సమావేశంలో సమీక్షించడం జరిగింది. మరియు ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించి ఉపాధి హామీ ద్వారా వచ్చు రూపాయలు లబ్ధిదారుల యొక్క జాబ్ కార్డు ప్రకారం అంచనాలు వేసి మంజూరు తీసుకోవాల్సిందిగా సంబంధిత ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించడం జరిగింది గ్రామంలో వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని తాగునీటి కలుషితం కాకుండా పారిశుధ్య విషయంలో తగు జాగ్రత్త తీసుకోవాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించడం జరిగింది. ఇట్టి సమావేశంలో అందరు పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయి సహాయకులు టెక్నికల్ అసిస్టెంట్ లో హాజరైనా రు.

## నంగునూరు శివారులో శాసన స్థంభం గుర్తింపు

జూన్ 12 వార్త సాక్ష్యం



సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో శాసన స్థంభాన్ని ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ శుక్రవారం గుర్తించారు. నంగునూరు గ్రామ శివారులో పప్పు సురేందర్ రెడ్డికి చెందిన వ్యవసాయ భూమిలో దీనిని గుర్తించినట్లు కొలిపాక శ్రీనివాస్ వెల్లడించారు. తెల్ల గ్రానైట్ రాయితో చెక్కిన ఈ స్తంభం మీద నలువైపులా మహావీరుని శిల్పాలు చెక్కి ఉన్నాయి. జైన శిల్పాల పైన సూర్య, చంద్రుల శిల్పాలు చెక్కి ఉన్నాయి. ఇందులో అక్షరాలు చెదిరిపోయి అచ్చు తీయడం కుదరలేదని శ్రీనివాస్ తెలిపారు. ఈ స్తంభం మూల స్థంభం అని చెప్పారు. దానిపైన అక్షరాలు చూశామని స్థానిక గొర్రెల కాపరులు తెలిపారు. నంగునూరులో లభించిన ఏకైక శాసనం చెదిరి పోవడం దురదృష్టకరమని శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. దీని శైలి ఆధారంగా ఇది చాళుక్యుల కాలానికి చెందినదని నిర్ధారించ వచ్చునని చెప్పారు. నంగునూరు ఒక పెద్ద జైన కేంద్రం అని చెప్పడానికి మరొక ఆధారం ఈ శాసన స్థంభమని పేర్కొన్నారు.

## ఈనెల 14న గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవం

-సీత్యాతండసర్పంచ్ ఉమాదేవి- వెంకన్న



జూన్ 12 వార్త సాక్ష్యం

మాడ్గులపల్లి మండలంలోని సీత్యాతండ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణం పూర్తిచేసుకున్న నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం భవనాన్ని ఈనెల14ఆదివారం ప్రారంభించనున్నట్లు. సీత్యాతండ గ్రామపంచాయతీ సర్పంచ్, రాయరపు ఉమాదేవి-వెంకన్న తెలిపారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సీత్యాతండ గ్రామపంచాయతీ నూతన కార్యాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్,లతో పాటు వివిధ హోదాలలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధు లు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. సీత్యా తండ గ్రామ పంచాయితీ, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# బిజినెస్

## 60 నుంచి 90 రోజులకు




న్యూఢిల్లీ:
పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భారత ప్రభుత్వం అత్యవసర ఇంధన నిల్వల సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 60 రోజుల నుంచి 90 రోజులకు పెంచుకోవాలనుకునే యోచనలో ఉందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇంధన భద్రత వ్యవస్థను పునఃసమీక్షిస్తోందని, అందులో భాగంగానే ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చిందన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు కాస్త కుదురుకున్న తర్వాత ముడి చమురు, పెట్రో ఉత్పత్తుల నిల్వల సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాలని ప్రభుత్వ రంగ ఇంధన కంపెనీలను కేంద్రం ఆదేశించనుందని అధికారి చెప్పారు. ఎందుకంటే, మన దేశీయ ఇంధన అవసరాల్లో 89 శాతం దిగుమతుల ద్వారానే సమకూరుతోంది. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత్ 24,070 కోట్ల డాలర్ల విలువైన ముడి చమురు, బంగారం, వంట నూనెలను దిగుమతి చేసుకుంది. 2025-26లో నమోదైన మొత్తం దిగుమతులు 77,500 కోట్ల డాలర్లలో వీటి వాటాయే 31 శాతం. అందులో ముడి చమురు దిగుమతుల విలువ 13,470 కోట్ల డాలర్లుగా ఉంది.ఇరాన్ నియంత్రణలో ఉన్న హోర్ముజ్ జలసం?ధి దిగ్బంధనంతో గత 3 నెలలుగా ముడి చమురు సహా ఇతర కమోడిటీల సరఫరా దాదాపు స్తంభించిపోయింది. పైగా క్రూడాయిల్ ధరలూ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు చైనా తరహాలో మనమూ అత్యవసర ఇంధన నిల్వల సామర్థ్యాన్ని భారీగా పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ప్రస్తుతం చైనా 6 నెలల అత్యవసర ఇంధన నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. భారత్ మాత్రం రెండు నెలలకు సరిపడా నిల్వలను కలిగి ఉంది. ప్రభుత్వ వ్యూహాత్మక నిల్వలతోపాటు ఆయిల్ రిఫైనరీలు, ఇంధన విక్రయ సంస్థ వద్దనున్న నిల్వలన్నీ కలిపి ఈ అత్యవసర ఇంధన నిల్వల పరిధిలోకి వస్తాయి. కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం, మంగళూరు, పాడూరులో మొత్తం 53.3 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన వ్యూహాత్మక ముడి చమురు నిల్వల కేంద్రాలను ఏర్పాటు చేసింది.

# తెలంగాణలో నేడు పలు జిల్లాలకు వర్ష సూచన

-మొదటిపేజీ **తరువాయి:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో గత మూడు రోజులుగా తెలంగాణలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. మధ్యాహ్న సమయాల్లో అక్కడక్కడా ఎండ తీవ్రత కనిపిస్తున్నప్పటికీ, వాతావరణంలో వస్తున్న ఆకస్మిక మార్పుల వల్ల అనేక ప్రాంతాల్లో మబ్బులు పట్టి వర్షాలు పడుతున్నాయి. వాతావరణ నిపుణుడు, వెదర్ మ్యాన్ బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం, ఈరోజు కూడా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కుమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. మరోవైపు, రుతుపవనాల రాకతో తీవ్రమైన వేసవి ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు పెద్ద ఉపశమనం లభించింది. పలు ప్రాంతాలలో వాతావరణం ఆహ్లాదకరంగా మారడమే కాకుండా, అప్పుడప్పుడు కురుస్తున్న జల్లులు ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి.

# భారతీయ సిబ్బంది నౌకపై దాడి..

# అమెరికాకు భారత్ మరోసారి గట్టి నిరసన

ధర్మఘంట జూన్ 12:
ఒమన్ తీరంలో భారతీయ నావికులు ఉన్న వాణిజ్య నౌకలపై వరుస దాడులు కొనసాగుతుండటంతో అమెరికా తీరు పట్ల భారత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. గత 48 గంటల్లో రెండోసారి ఢిల్లీలోని అమెరికా సీనియర్ దౌత్యాధికారిని విదేశాంగ శాఖ పిలిపించి అధికారికంగా నిరసన తెలిపింది. నిన్న జరిగిన ఘటనలో 20 మంది భారతీయ సిబ్బంది ఉన్న ఓ వాణిజ్య నౌక దాడికి గురికావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. అమెరికా అధికారి జేసన్ మీక్స్‌ను పిలిపించి భారత విదేశాంగ శాఖ తమ ఆందోళనలను నేరుగా తెలియజేసింది. గత దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందడంతో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒమన్ తీర ప్రాంతంలో నాలుగు రోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న మూడు వాణిజ్య నౌకలను అమెరికా నౌకాదళం లక్ష్యంగా చేసుకుందని భారత ప్రభుత్వం వెల్లడించింది. భారత నావికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.



సెట్టెబెల్లో నౌకపై దాడి జరిగిన వెంటనే అమెరికా అధికారులకు గట్టి నిరసన తెలిపినట్లు వెల్లడించారు. ఇలాంటి దాడులు వెంటనే ఆగాలని, సమస్యల పరిష్కారానికి యుద్ధం కంటే చర్చలు, దౌత్య మార్గాలే సరైనవని భారత్ స్పష్టం చేసిందన్నారు. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నౌకాయానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని భారత్ కోరింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించేందుకు అన్ని పక్షాలు సంభాషణల బాట పట్టాలని ఢిల్లీ పిలుపునిచ్చింది.

# పంత్ కెరీర్ ముగిసిపోయిందని భావించడం తప్పు: ఇర్ఫాన్ పఠాన్



ఇంటర్నెట్ డెస్క్:
టీమిండియా స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ రిషభ్ పంత్ కొంతకాలంగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్ 2026లోనూ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున పేలవ ప్రదర్శన చేశాడు. కెప్టెన్‌గా జట్టును అట్టడుగు స్థానంలో నిలిపాడు. దీంతో బీసీసీఐ ఇటీవల ప్రకటించిన వన్డే, టీ20 జట్టులో పంత్ చోటు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్.. పంత్ కెరీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పంత్ విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సెలక్టర్లకు సూచించాడుపంత్ వైట్ బాల్ జట్టులో మాత్రమే స్థానం కోల్పోయాడు. అతడి కెరీర్ ముగిసిపోయిందని భావించడం తప్పు. పంత్ తిరిగి భారత జట్టులోకి రావడానికి అవకాశాలు ఉన్నాయి. పరిమిత ఓవర్లలో పంత్ ప్రస్తుతం ఫామ్ కోల్పోయాడు. ఐపీఎల్‌లోనూ నిరాశపర్చడంతో సెలక్టర్లు అతడిని తప్పించారు. ప్రస్తుతం వన్డేల్లో వికెట్ కీపర్, బ్యాటర్‌గా కేఎల్ రాహుల్ భారత జట్టు తొలి ఎంపిక. బ్యాకప్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు. అతడు టాప్ ఆర్డర్‌లో ఆడగలడు. మూడో ఎంపిక సంజు శాంసన్ కావాలి. అతడికి అవకాశం వచ్చినప్పుడల్లా నిరూపించుకున్నాడు. కాబట్టే పంత్‌ను వన్డేల్లో తప్పించాల్సి వచ్చింది' అని ఇర్ఫాన్ వెల్లడించాడు. 'వన్డే ప్రపంచ కప్ 2027 సమీపిస్తోన్న నేపథ్యంలో సెలక్టర్లకు నేనిచ్చే సూచన ఒకటే.. పంత్‌ను పూర్తిగా విస్మరించొద్దు. ప్రస్తుతం అతడు కేవలం వైట్ బాల్ క్రికెట్‌లో వెనుకబడ్డాడు. ఇషాన్ కిషన్‌ను చూడండి.. జట్టులో చోటు కోల్పోయిన తర్వాత దేశవాళీ క్రికెట్‌లో రాణించి మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చాడు. జార్ఖండ్‌కు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ అందించాడు. పంత్ కూడా అదే మార్గంలో ముందుకు సాగాలి. కష్టపడి మళ్లీ తన స్థానాన్ని సంపాదించుకోవాలి' అని పఠాన్ పేర్కొన్నాడు. ఐపీఎల్ 2026లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున ఆడిన పంత్.. 14 మ్యాచ్‌ల్లో కేవలం 312 పరుగులే చేయగలిగాడు. జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలవడంతో కెప్టెన్సీ బాధ్యతల నుంచి కూడా తప్పుకున్నాడు. అయితే ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో 121 బంతుల్లో 81 పరుగులు చేసి తన క్లాస్‌ను మరోసారి నిరూపించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతడి ప్రతిభ ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశాడు. 2024 ఆగస్టులో చివరి సారిగా పంత్ వన్డే మ్యాచ్ ఆడాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ విజేత జట్టులో సభ్యుడిగా ఉన్నప్పటికీ ఒక్క మ్యాచ్‌లోనూ తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు.



# నేటి నుంచే ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్.. పాక్‌తో భారత్ పోరు.. ఎప్పుడంటే?

ఇంటర్నెట్ డెస్క్:
ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ 2026కు కౌంట్‌డౌన్ మొదలైంది. నేడు సాయంత్రం 5:30(భారత కాలమానం ప్రకారం రాత్రి 11:00) గంటలకు ఈ టోర్నీ అట్టహాసంగా ప్రారంభం కానుంది. మహిళల క్రికెట్‌కు అంతకంతకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో క్రికెట్ ప్రేమికులకు పూనకాలు తెప్పించేలా ఈ మెగా టోర్నీ సాగనుంది. పాకిస్థాన్‌తో జరిగే హైఓల్టేజ్ మ్యాచ్‌తో భారత్ తన టైటిల్ వేటను ప్రారంభించబోతోంది. జూన్ 14న జరిగే ఈ మ్యాచ్‌కు బర్మింగ్‌హామ్(ఇంగ్లండ్) ఆతిథ్య మివ్వనుంది. నేటి(శుక్రవారం) నుంచి జులై 5 వరకు ఇంగ్లండ్, వేల్స్‌లో జరగనున్న ఈ మెగా టోర్నమెంట్‌లో మొత్తం 12 జట్లు తలపడుతున్నాయి. వీటిని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో 6 జట్లు ఉంటాయి. గ్రూప్ స్టేజ్‌లో ప్రతి టీమ్ మిగిలిన జట్లతో ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది. ఆ తర్వాత రెండు గ్రూపుల నుంచి టాప్-2 లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఇక.. టీమ్‌ఇండియా విషయానికొస్తే.. భారత్ గ్రూప్ వన్‌లో ఉంది. ఇదే గ్రూప్‌లోనే బలమైన ఆస్ట్రేలియాతో పాటు పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లు ఉన్నాయి.ఇటీవల వన్డే ప్రపంచ కప్‌ను




గెలుచుకుని ఫుల్ జోష్‌లో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని ఉమెన్ ఇన్ బ్లూ.. ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లోనూ హిస్టరీ క్రియేట్ చేయాలని చూస్తోంది. ఇప్పటివరకు భారత మహిళల జట్టు ఐదుసార్లు సెమీఫైనల్‌కు చేరినప్పటికీ.. ఒక్కసారీ పొట్టి కప్‌ను అందుకో లేకపోయారు. దీంతో ఈసారి ఎలాగైనా కప్ కొట్టి తీరాలనే కసిమీద అమ్మాయిలున్నారు.

# స్పోర్ట్స్

## అంతర్జాతీయ క్రికెట్‌కు కేన్ విలియమ్సన్ వీడ్కోలు




ఇంటర్నెట్ డెస్క్:
న్యూజిలాండ్ క్రికెట్ దిగ్గజం కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా రిటైర్‌మెంట్ పోస్ట్ చేశాడు. దాదాపు రెండు దశాబ్దాల పాటు కివీస్ జట్టుకు సేవలందించిన ఈ స్టార్ బ్యాటర్.. తన రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని ఆకస్మికంగా ప్రకటించి అభిమానులను ఆశ్చర్యానికి గురి చేశాడు. 35 ఏళ్ల విలియమ్సన్ తీసుకున్న ఈ అనూహ్య నిర్ణయం తక్షణమే అమల్లోకి రానుంది. దీంతో ప్రస్తుతం ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో కూడా అతడు ఇకపై కనిపించే అవకాశం లేదు. మిగిలిన మ్యాచ్‌ల కోసం అతడి స్థానంలో కివీస్ మేనేజ్‌మెంట్ కొత్త ఆటగాడిని త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. రిటైర్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో విలియమ్సన్ భావోద్వేగానికి గురయ్యాడు. 'ఈ నిర్ణయం గురించి కొంతకాలంగా ఆలోచిస్తున్నాను. అయితే ఇదే సరైన సమయమని నాకు అనిపించింది. న్యూజిలాండ్ తరఫున ఆడటం నాకెప్పుడూ గర్వకారణం. ప్రతి మ్యాచ్‌లో నా శక్తి మేరకు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నించాను. అంతకంటే తక్కువ స్థాయిలో కొనసాగడం సరికాదని అనిపించింది. అయితే నా రిటైర్‌మెంట్ నిర్ణయం నేనే తీసుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. అలాగే న్యూజిలాండ్ జట్టు భవిష్యత్తుపై నాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ జట్టులో అపారమైన ప్రతిభ ఉంది. గొప్ప విజయాలు సాధించాలనే తపన కూడా కనిపిస్తోంది. ఈ జట్టుతో నా అనుబంధం ఎప్పటికీ ప్రత్యేకంగానే ఉంటుంది. ఇన్నేళ్లు ఈ ప్రయాణంలో భాగం కావడం నా అదృష్టం' అని విలియమ్సన్ వెల్లడించాడు.


వార్త సాక్ష్యం
శనివారం 13 జూన్, 2026

# ‘వీరభద్రుడు’ ( అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!



సూర్య కథానాయకుడిగా తమిళంలో నటించిన సినిమానే ‘కరుప్పు’. తెలుగులో ఈ సినిమాను ‘వీరభద్రుడు’ టైటిల్ తో విడుదల చేశారు. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 15వ తేదీన థియేటర్లకు వచ్చింది. 130 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, 300 కోట్లకి పైగా వసూలు చేయడం విశేషం. త్రిష .. ఆర్జే బాలాజీ ..శ్వాసిక కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ రోజు నుంచి తమిళంతో పాటు ఇతర భాషల్లోను ‘అమెజాన్ ప్రైమ్’లో స్ట్రీమింగ్ అవుతోంది. మునుస్వామి (ఇంద్రన్) తన కూతురు ‘మీను’ (అనఘ మాయ)ను వెంటబెట్టుకుని సిటీకి వస్తాడు. ఆమె లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఉంటుంది. లివర్ మార్పిడికి పెద్దమొత్తంలో డబ్బు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెబుతారు. అందువలన అతను తన దగ్గరున్న 60 సవర్ల బంగారాన్ని బ్యాంకులో పెట్టి డబ్బు తీసుకోవడం కోసం వస్తాడు. అయితే అతను ట్రైన్ దిగగానే దొంగలు ఆ నగలు కొట్టేసి పారిపోతారు. దాంతో తండ్రీ కూతుళ్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తారు. పోలీసులు 45 సవర్ల బంగారాన్ని మాత్రమే రికవరీ చేయగలుగుతారు. ఆ నగలను కోర్టు ద్వారా తీసుకోమని చెబుతారు. ఆ కేసును లాయర్ బేబీ కృష్ణ (ఆర్జే బాలాజీ) తీసుకుంటాడు. కేసును ఎటూ తేల్చకుండానే బేబీ కృష్ణ టీమ్ తమ టిఫిన్ బిల్లులను మునుస్వామితో కట్టిస్తుంటారు. అలా 4 నెలలు గడిచిపోతుంది. ‘మీను’ ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతుంది. అయినా తన బంగారం తన చేతికి రాకపోవడంతో మునుస్వామి విసిగి పోతాడు. కోర్టుకి సమీపంలో ఒక వీరభద్రస్వామి గుడి ఒకటి ఉంటుంది. స్వామికి మనసులో మాట చెప్పుకుంటే, తప్పకుండా నెరవేరుతుందని మునుస్వామి వింటాడు. తన కూతురును కాపాడమని వేడుకుంటాడు. దాంతో నేరుగా వీరభద్రుడు (సూర్య) రంగంలోకి దిగుతాడు. నేరుగా బేబీ కృష్ణకి కనిపించి, పద్ధతి మార్చుకోమని హెచ్చరిస్తాడు. దేవుడిలా అతీత శక్తులు చూపించకుండా, కోర్టుకు వచ్చి ‘మీను’కి న్యాయం చేసి చూడమని అతను వీరభద్రుడికి సవాల్ విసురుతాడు. అప్పుడు వీరభద్రుడు ఏం చేస్తాడు? అవినీతి పరులపై ఎలా విరుచుకుపడతాడు? అనేది కథ. సాధారణంగా ఎవరి చేతిలోనైనా మోసపోయి నప్పుడు, మోసం చేసినవారికి తగిన గుణపాఠం చెప్పడానికి దేవుడు దిగివస్తే బాగుండునని చాలామంది అనుకుంటారు. మోసం చేసినవాళ్లు, తమని శిక్షించడానికి దేవుడు దిగివస్తాడా ఏంటి? అని నవ్వుకుంటారు. అయితే నిజంగానే దేవుడు దిగి వస్తే ఎలా ఉంటుందనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఆ దేవుడు కూడా ఒక మనిషి మాదిరిగానే ఎలా పరిస్థితులను చక్కదిద్దగలిగాడు? అనే కుతూహలాన్ని రేకెత్తిస్తూ మలుపులు తీసుకుం టుంది. ఈ కథ అంతా కూడా కోర్టు .. లాయర్ల చుట్టూ తిరుగుతుంది. కోర్టుకు ఒక ప్రొసీజర్ ఉంటుంది దేవుడు దిగివచ్చినా దానిని మార్చలేడు. మహిమలు లేకుండా మనిషిగా వచ్చి కోర్టు పరిధిలో న్యాయం జరిగేలా చూడమని కథానాయకుడిని ప్రతి నాయకుడు సవాల్ చేయడమే ఈ కథలోని కీలకమైన మలుపుగా చెప్పుకోవాలి. శిక్షించడానికి వచ్చిన దేవుడికి పరీక్ష పెట్టడం ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది.లాయర్ గా వీరభద్రుడు కోర్టుకు రావడం .. ‘మీను’ కేసును పరిష్కరించడం వరకూ బాగానే ఉంటుంది. ఆ తరువాత వీరభద్రుడి ప్రభావం కారణంగా, అసత్యాలు చెప్పాలనుకున్నవారు సైతం మాట తడబడిపోయి నిజాలు చెబుతూ ఉంటారు. దాంతో చకచకా కేసులు పరిష్కారమవుతూ ఉంటాయి. ఇక్కడే గ్రాఫ్ పడిపోయినట్టుగా అనిపిస్తుంది. ఎందుకంటే ఈ అంశానికి సంబంధించిన సన్నివేశాలు పెద్దగా ఆకట్టుకోలేక పోయాయి. తండ్రీ కూతుళ్లు లాయర్ల ఉచ్చులో చిక్కుకోవడం ఎమోషనల్ గా బాగా కనెక్ట్ అవుతుంది. న్యాయమూర్తులు .. న్యాయవాదులు .. పోలీసులు .. రౌడీలు కుమ్మక్కయితే ఒక సామాన్యుడికి ఆ దేవుడే దిక్కు అనే పాయింట్ ను టచ్ చేస్తూ వెళ్లిన తీరు ఆకట్టుకుంటుంది. దేవుడైనా సరే దిగివస్తే, మనుషుల చేతిలో మోసపోవలసిందే అనే విషయాన్ని ఆవిష్కరించిన విధానం మెప్పిస్తుంది. కష్టాల్లో ఉన్న ఒక వ్యక్తి కన్నీరు దొంగలను కదిలించి వేస్తుంది గానీ, పోలీసులు లాయర్ల హృదయాలను కరిగించ లేపోవడమనే సీన్ హైలైట్ గా నిలుస్తుంది.ఈ సినిమాలో ఆశ్చర్యకరమైన విషయం ఒకటుంది. అది ఏంటంటే హీరో సూర్య ఎంట్రీ, మొదటి అరగంట దాటిన తరువాతనే ఉంటుంది.ఇక మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే లాయర్ వీరభద్రుడుగా వచ్చింది సాక్షాత్తు దేవుడని తెలిసిన ఆ విషయాన్ని విలన్ ఈజీగా తీసుకోవడం. ఇక వీరభద్రుడు .. ప్రీతీ ద్వారా పరిష్కరించే రెండో కేసుకు సంబంధించిన సీన్ అంతగా ఇంపాక్ట్ చూపలేకపోయింది.ఎలాంటి అండదండలు లేనివారు తమకి ఏదైనా కష్టం వచ్చినప్పుడు పోలీసులను న్యాయవాదులను ఆశ్రయిం చవలసి వచ్చినప్పుడు, వాళ్లకి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయనేది దర్శకుడు చూపించిన విధానం ఆసక్తికరంగా అనిపిస్తుంది. విష్ణు ఫొటోగ్రఫీ సాయి అభ్యంకర్ నేపథ్య సంగీతం . కలైవానన్ ఎడిటింగ్ ఫరవాలేదు. వీరభద్రుడిగా సూర్య లుక్ వీరభద్రస్వామి నేపథ్యంలో వచ్చే సీన్స్ .. అందుకు సంబంధించిన గ్రాఫిక్స్ తండ్రీ కూతుళ్ల ఎమోషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. కొన్ని సీన్స్ వాస్తవానికి చాలా దగ్గరగా వెళితే, మరికొన్ని సన్నివేశాలు చాలా తేలికగా తేలిపోతూ ఉంటాయి. బలమైన కొన్ని సన్నివేశాలు మాత్రమే బాగున్నాయని అనిపిస్తుంది అంతే.

## ఒకప్పుడు పార్లే జి బిస్కెట్లు తిని కడుపు నింపుకున్నాడు... ఇవాళ బాలీవుడ్ స్టార్!



బాలీవుడ్‌లో విలక్షణ నటుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రాజ్‌కుమార్ రావు, ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. కెరీర్ ప్రారంభంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, అవమానాలను ఎదుర్కొన్నట్లు ఆయన తాజాగా వెల్లడించారు. నటనపై మక్కువతో ముంబైకి వచ్చిన కొత్తలో తన బ్యాంకు ఖాతాలో కేవలం 18 రూపాయలు మాత్రమే ఉండేవని, ఒకే ఒక్క పార్లే-జి బిస్కెట్ ప్యాకెట్‌తో రోజంతా గడిపిన సందర్భాలు ఉన్నాయని ఆయన గుర్తుచేసుకున్నారు.తన కష్టకాలంలో ఫిల్మ్ స్కూల్ స్నేహితులు అండగా నిలిచారని రాజ్‌కుమార్ తెలిపారు. నటన తప్ప తనకు మరో ‘ప్లాన్ బి’ ఎప్పుడూ లేదని, నటుడు కావాలన్న బలమైన సంకల్పంతోనే ముంబైలో నిలదొక్కుకున్నానని చెప్పారు. అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న సమయంలో తన రూపంపై అనేక విమర్శలు ఎదుర్కొన్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు. “మీరు పొడవుగా లేరు, మీ శరీరాకృతి సరిగా లేదు, కనుబొమ్మల ఆకృతి కూడా బాగాలేదు” అంటూ తనను తిరస్కరించేవారని, ఆ సమయంలో “మరి నటన సంగతేంటి?” అని తాను ప్రశ్నించేవాడినని ఆనాటి చేదు అనుభవాలను పంచుకున్నారు. గురుగ్రామ్‌లో జన్మించిన రాజ్ కుమార్ రావు, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో శిక్షణ పొందారు. 2010లో ‘లవ్ సెక్స్ ఔర్ ధోకా’ చిత్రంతో సినీ అరంగేట్రం చేసిన ఆయన, ‘కై పో చే!’, ‘షాహిద్’ వంటి సినిమాలతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ‘షాహిద్’ చిత్రానికిగానూ ఆయన జాతీయ అవార్డును సైతం గెలుచుకున్నారు. 2018లో విడుదలైన ‘స్త్రీ’ సినిమాతో కమర్షియల్ హీరోగా ఎదిగిన రాజ్ కుమార్, ఇటీవలి వచ్చిన ‘స్త్రీ 2’తో తన మార్కెట్‌ను మరింత సుస్థిరం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన ‘ప్రహార్’, సౌరవ్ గంగూలీ బయోపిక్ ‘దాదా’, ‘రఫ్తార్’ వంటి చిత్రాల్లో నటిస్తున్నారు.

## దర్శకుడిగా మారిన విశాల్.. యాక్షన్ మోడ్‌లో అదిరిన ‘మకుటం’ టీజర్




యాక్షన్ హీరో విశాల్ తన కెరీర్‌లో మరో కీలక ముందడుగు వేశారు. నటుడిగా వరుస విజయాలు అందుకుంటున్న ఆయన, ఇప్పుడు దర్శకుడిగానూ తన ప్రతిభను చూపించబోతున్నారు. విశాల్ స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘మకుటం’. ‘మార్క్ ఆంటోనీ’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ టీజర్‌ను చిత్రబృందం గురువారం విడుదల చేసింది. ఈ టీజర్ ఆద్యంతం యాక్షన్ ప్రియులను ఉర్రూతలూగించేలా ఉంది.మండుతున్న శవం నుంచి సిగరెట్ వెలిగించుకుంటూ విశాల్ ఇచ్చిన ఎంట్రీ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో విశాల్ మూడు విభిన్నమైన గెటప్స్‌లో కనిపించనుండటం విశేషం. టీజర్‌లో చూపిన మూడు లుక్స్ కూడా ఆయన నటనలోని విశ్వరూపాన్ని సూచిస్తున్నాయి. ఇక హీరోయిన్ అంజలి పాత్ర కూడా చాలా భిన్నంగా ఉండబోతున్నట్లు టీజర్ స్పష్టం చేసింది. ఆమెను ఇంతవరకూ చూడని విధంగా మాస్ యాక్షన్ అవతారంలో చూపించి ఆశ్చర్యపరిచారు. హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు, అదిరిపోయే విజువల్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై స్వర్గీయ నిర్మాత ఆర్.బి. చౌదరి సమర్పణలో ఈ చిత్రం 99వ సినిమాగా రూపుదిద్దుకుంటోంది. రవి అరసు అందించిన కథ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. సాంకేతిక అంశాల పరంగానూ టీజర్ ఉన్నత స్థాయిలో ఉంది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన నేపథ్య సంగీతం యాక్షన్ సన్నివేశాలకు ప్రాణం పోయగా, రిచర్డ్ ఎం నాథన్ సినిమాటోగ్రఫీ విజువల్ ట్రీట్‌లా అనిపించింది. దర్శకుడిగా, హీరోగా విశాల్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో స్టైలిష్‌గా తీర్చిదిద్దినట్లు స్పష్టమవుతోంది.

## ప్రేక్షకుల ముందుకు సమంత –‘మా ఇంటి బంగారం’ రిలీజ్ ఎప్పుడంటే..!

**–సెన్సార్ పూర్తి చేసుకున్న సమంత ‘మా ఇంటి బంగారం’**

**–జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల**

**–యాక్షన్, ఫ్యామిలీ డ్రామాగా రానున్న చిత్రం**

**–స్వీయ నిర్మాణంలో ప్రధాన పాత్రలో నటిస్తున్న సమంత**



ఐపీఎల్ కారణంగా గతంలో వాయిదాపడిన రిలీజ్బార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వయంగా నిర్మించిన చిత్రం ‘మా ఇంటి బంగారం’ విడుదలకు సిద్ధమైంది. తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం ‘ఖ/యూ’ సర్టిఫికెట్‌ను పొందింది. ఈ యాక్షన్ ఫ్యామిలీ డ్రామాను 2026, జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన లభించడంతో, చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. బి.వి. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సమంత తన సొంత నిర్మాణ సంస్థ ‘ట్రలాలా మూవింగ్ పిక్చర్స్’ బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరులతో కలిసి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమాలో గుల్షన్ దేవయ్య, దిగంత్ మంచాలే, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందించగా, ఓం ప్రకాశ్ ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహించారు. సుమారు రెండు గంటల నిడివి కలిగిన ఈ చిత్రంలో సమంత సాహసోపేతమైన యాక్షన్ సన్నివేశాలను స్వయంగా చేసినట్లు తెలుస్తోంది.సంప్రదాయ కుటుంబానికి చెందిన ఓ నవవధువు గతాన్ని చుట్టుముట్టిన రహస్యాలు, వాటి వల్ల ఆమె కుటుంబానికి ఎదురయ్యే ముప్పును ఆమె ఎలా దీటుగా ఎదుర్కొందనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. వాస్తవానికి ఈ చిత్రాన్ని మే 15నే విడుదల చేయాలని భావించినప్పటికీ, ఐపీఎల్ 2026 సీజన్ దృష్ట్యా జూన్ 19కి వాయిదా వేశారు.కొంత విరామం తర్వాత సమంత ప్రధాన పాత్రలో వస్తున్న చిత్రం కావడంతో సినీ అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం తమిళంలో ‘ఎంగల్ తంగం’ పేరుతో ఏకకాలంలో విడుదల కానుంది. ఇక జూన్ 18 నుంచే ఓవర్సీస్ ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.